క్లుప్తంగా

కళాశాల నిర్మాణానికి విరాళం


ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న పరిశ్రమ ఎండీ ప్రకాశ్ గోయంకా

షాద్‌నగర్: దాతల సహకారంతో పట్టణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సోమవారం ఎలికట్ట గ్రామ శివారులో ఉన్న దేవశ్రీ ఇస్పాత్ పరిశ్రమ యాజమాన్యం రూ.11లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఎండీ ప్రకాశ్ గోయంకా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కలిసి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది మోముల బసప్ప పాల్గొన్నారు.

కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, బస్వం, ముబారక్, కొమ్ము కృష్ణ, నర్సింలు, శ్రీనివాస్, రవితేజ, అశోక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

షాద్‌నగర్‌రూరల్: చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించినందుకు గాను సోమవారం బీసీ సేన నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, చంద్రశేఖరప్ప, శంకర్, చంద్రశేఖర్, బాల్‌రాజ్, నర్సింలు, బాస వరలక్ష్మి, జయ, శ్రీకాంత్, జలజ, ప్రవంతి, భాగ్యలక్ష్మి, మమత, బాలమణి, సరస్వతీ, శారద పాల్గొన్నారు.

తీరిన మురుగునీటి సమస్య


మురుగు తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కేశంపేట: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లి గ్రామ శివారులోని తెట్టేకుంటతండాలో మురుగునీరు ఇళ్ల మధ్యలో చేరి దుర్వాసన వస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారనే విషయంపై మురుగు నిలిచి.. దుర్గంధం వ్యాపించి అనే శీర్షికతో సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ సిబ్బంది స్పందించారు. మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, పంచాయతీ కార్యదర్శి యాదయ్య సిబ్బందితో కలిసి తండాలో మురుగునీరు వెళ్లే విధంగా ఏర్పాట్లు చేశారు. మురుగు తొలగించడంపై తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

తవ్వారు.. మరిచారు


పైపులైన్ మరమ్మతుల కోసం తీసిన గుంత

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో రోడ్డు పక్కనే మంచినీటి పైపులైన్ మరమ్మతుల కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారింది. అది ప్రధాన రోడ్డులోనే ఉండడంతో వాహనాదారులు, పాదాచారులకు ఇబ్బందిగా మారింది. చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి అందులో పడిపోయే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

బీసీ సేన గ్రామ కమిటీ ఎన్నిక

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి గ్రామంలో సోమవారం బీసీసేన గ్రామ మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా భారతమ్మ, ఉపాధ్యక్షురాలిగా నర్సమ్మ, ప్రధాన కార్యదర్శిగా మమత, కోశాధికారిగా బాలమణి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బీసీ సేన మండల అధ్యక్షురాలు ప్యాట జయ, నాయకులు బాల్‌రాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు

షాద్‌నగర్: మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలోని శ్రీ గోదారంగనాయకస్వామి దేవాలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా దేవాలయ ధర్మకర్తల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ముగింపు ఉత్సవాల్లో భాగంగా సుప్రభాత సేవ, నిత్యారాధన, మహాపూర్ణాహుతి, చక్రతీర్థం, పల్లకీసేవ వంటి పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేశ్‌గుప్తా, భక్తులు ఉన్నారు.

గ్రంథాలయ భవనానికి తాళం

ప్రారంభించినా తెరుచుకోని లైబ్రరీ

- చేసిన పనులకు బిల్లులు రావాలని కాంట్రాక్టర్ ఆవేదన
- పాఠకులకు తప్పని ఇబ్బందులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు


తాళం వేసిన ఉన్న కొత్త గ్రంథాలయ భవనం

కొత్తూరు: మున్సిపాలిటీలో ఇటీవల అత్యాధునిక హంగులతో గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. అన్ని పనులు పూర్తికావడంతో భవనాన్ని ఏప్రిల్ 16వ తేదీన అధికారులు ప్రారంభించారు. కానీ తర్వాత రోజు నుంచి భవనం తలుపులకు తాళం దర్శనమిస్తోంది. కాంట్రాక్టర్ తాను చేసిన పనులకు ఇంకా డబ్బులు రావాలని డిమాండ్ చేస్తున్నాడు. దీనిపై అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేక పోవడంతో మరుసటి రోజే గుత్తేదారు తాళం వేసుకున్నాడు. పాఠకులు, స్థానికులు సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరించి భవనాన్ని అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

రూ.75లక్షలతో నిర్మాణం

గత ప్రభుత్వంలో మున్సిపాలిటీలో సుమారు రూ.75లక్షలతో గ్రంథాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో పనులు పూర్తికావడంతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా ప్రారంభించారు. అప్పట్లోనే భవన నిర్మాణానికి అదనపు నిధులు అవసరమని సదరు కాంట్రాక్టర్ అధికారులకు సూచించాడు. వారు పనులు పూర్తి చేసిన తర్వాత మంజూరు చేస్తామని చెప్పడంతో సొంత నిధులు వెచ్చించి పనులు పూర్తి చేసినట్లు కాంట్రాక్టర్ ప్రచారం చేసుకుంటున్నాడు. భవన నిర్మాణం పూర్తి కావడం.. ప్రారంభానికి నోచుకోవడం లేదని పలు పత్రికల్లో కథనాలు రావడంతో స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే గ్రంథాలయ సంస్థ చైర్మన్‌తో మాట్లాడి కాంట్రాక్టర్‌తో చర్చించి భవనాన్ని ప్రారంభించారు. తర్వాత కాంట్రాక్టర్‌కు నిధులు ఇవ్వకపోవడంతో తిరిగి భవనానికి తాళం వేసుకున్నాడు.


షెటర్లో కొనసాగుతున్న గ్రంథాలయం

ఇరుకు గదిలో..

మొదట్లో పట్టణంలోని గ్రంథాలయానికి నిత్యం 150కిపైగా పాఠకులు వచ్చేవారు. ప్రస్తుతం ఇరుకు షెటర్లో ఉండడం.. కూర్చోడానికి స్థలం లేకపోవడంతో లైబ్రరీకి వచ్చే పాఠకుల సంఖ్య 25 నుంచి 30 మధ్యే ఉంటుంది. ప్రస్తుతం దాంట్లో నిత్యం 14 దినపత్రికలు, 700కి పైగా పోటీ పరీక్షలు, ఇతర పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

త్వరలో అందుబాటులోకి..



నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని త్వరలో పాఠకులకు అందుబాటులోకి తీసుకొస్తాం. భవనానికి గేటు ఏర్పాటు చేయకపోవడంతోనే ఆలస్యం జరిగింది. గేటు ఏర్పాటుతో పాటు మిగిలిన పనులు పూర్తి చేసి భవనాన్ని అందుబాటులోకి తేవాలని ఇప్పటికే సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించాం.

– మధుసూదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య


కేశంపేట: బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు


మొయినాబాద్‌రూరల్: బడీడు పిల్లలతో ఉపాధ్యాయులు

యూటీఎఫ్ మండల కార్యదర్శి రామకృష్ణ

కేశంపేట: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని టీఎస్‌యూటీఎఫ్ మండల కార్యదర్శి రామకృష్ణ అన్నారు. టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ముందస్తుగా బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం మండల పరిధిలోని ఇప్పలపల్లి గ్రామంలో బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో పాటు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ఆటస్థలాలు ఉంటాయని, నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండటంతో చక్కగా పాఠాలను బోధిస్తారన్నారు. విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినీత్, రోజ, శివ, వైష్ణవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

మొయినాబాద్‌రూరల్: బడీడు పిల్లలను తల్లిదండ్రులు తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని మండల విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహాచారి, హెచ్‌ఎం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో బడిబాటలో భాగంగా బడీడు పిల్లలను బడికి పంపించాలంటూ ఇంటింటికీ తిరుగుతూ చిన్నారుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో పాటు నర్సింహాచారి మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. ప్రభుత్వం ద్వారా అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకే బడిబాట నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కైసర్, అహ్మద్, అలివేలు మంగ, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు సరస్వతీ, స్వర్ణలత, రమా, నందీశ్వర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ


ఎరువు దుకాణంలో స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి వెంకటేశం

షాబాద్: రైతులకు నాణ్యత గల విత్తనాలు విక్రయించాలని మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం సూచించారు. సోమవారం మండల పరిధిలోని నాగర్‌గూడలో శ్రీమల్లికార్జున ట్రేడర్స్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యత గల విత్తనాలు విక్రయించాలని సూచించారు. రైతులకు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు సంబంధించి బిల్లు రశీదులు ఇవ్వాలన్నారు. ఎమ్మార్పీకే విక్రయించాలని, ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ షాపు ఎదుట స్టాక్ బోర్డు పెట్టాలని, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని కోరారు. కాలం తీరిన పరుగు మందులు, విత్తనాలు విక్రయించొద్దన్నారు.

పంటల సాగుపై అవగాహన అవసరం

సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రగతికుమారి

చేవెళ్ల: రైతులకు సాగు చేసే పంటలపై అవగాహన అవసరమని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ ప్రగతికుమారి అన్నారు. మండలంలోని అల్లవాడ గ్రామంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు పంటల సాగులో పాటించాల్సిన ఆధునిక పద్ధతులను వివరించారు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన సంస్థ విద్యార్థినులు దేవి, శ్రావణి, డాక్టర్ జి.వినయ్, రైతులు, వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులు తక్కువగా వాడాలి

మొయినాబాద్: రైతులు పంటలకు యూరియా, రసాయన ఎరువులు తక్కువ మోతాదులో వాడాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం సహజ వనరులు, పర్యావరణ విభాగం డైరెక్టర్ కె.పి.వాణి సూచించారు. మండల పరిధిలోని మోత్కుపల్లిలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటమార్పిడి విధానాన్ని అవలంబించడంతో పాటు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారం పెంచుకోవాలన్నారు. ఉద్యాన శాస్త్రవేత్త డి.రజినీ మాట్లాడుతూ.. కూరగాయ పంటలకు డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్, మల్చింగ్ పేపర్ వాడుకోవడంతో నీటి వృధాను తగ్గించి కలుపు నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అనురాధ, ఏఈఓ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.


చేవెళ్ల: అల్లవాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

ఎస్‌డీఎఫ్ బిల్లులు విడుదల చేయాలి

కొందుర్గు: బీఆర్‌ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన ఎస్‌డీఎఫ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని బీఆర్‌ఎస్ జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణితో 2023–24 సంబంధించిన బిల్లులు విడుదల చేయకుండా 2025 బిల్లులు విడుదల చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బిల్లుల చెల్లింపులో పక్షపాతం చూపడం సరికాదని ఆరోపించారు.

బీఫ్ షాపును తొలగించాలని వినతి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ఉన్న బీఫ్ షాపును తొలగించాలని కోరుతూ వార్డుకు చెందిన బచ్చు శ్రీధర్, బచ్చు లక్ష్మీకాంత్, కుమార్, శేఖర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి సోమవారం మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 13వ వార్డులో బీఫ్ షాపు కారణంగా వార్డులో పెద్దఎత్తున దుర్వాసన వస్తోందని, కుక్కలు మాంసపు వ్యర్థాలను తీసుకొచ్చి ఇంటి ముందు వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వారి విజ్ఞప్తిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి, తగు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

'గ్రీన్ ఇండియా' ఇన్‌చార్జిగా పృథ్వీరాజ్

చేవెళ్ల: బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎంపీ సంతోష్ కుమార్ గ్రీన్ ఇండియా హరితసేన చేవెళ్ల మండల ఇన్‌చార్జిగా పృథ్వీరాజ్ ఎన్నికైనట్లు పార్టీ మండల అధ్యక్షుడు పి.ప్రభాకర్ తెలిపారు. చేవెళ్లలో సోమవారం గ్రీన్ ఇండియా హరితసేన ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. గ్రీన్ ఇండియా హరితసేన చేవెళ్ల ఇన్‌చార్జిగా ఆలూరుకు చెందిన పృథ్వీరాజ్‌ను ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు కృషి చేసిన మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, గ్రీన్ ఇండియా కో–ఫౌండర్ రాఘేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌రెడ్డి, రాంప్రసాద్, ఎల్లన్న, భాస్కర్, ఉపేందర్‌రెడ్డి, అలీఖాన్, అసిఫ్, అభిషేక్, కార్తీక్ ఉన్నారు.

క్యాంపు కార్యాలయంపై దాడి సరికాదు

మొయినాబాద్‌రూరల్: సిరిసిల్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని చేవెళ్ల బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి దేశమల్ల ఆంజనేయులు అన్నారు. సోమవారం హిమాయత్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ.. సిరిసిల్లలోని ఎమ్మెల్యే కేటీఆర్ క్యాంపు కార్యాలయంలో రేవంత్‌రెడ్డి ఫొటో పెడతామని వచ్చి దాడికి యత్నించిన కాంగ్రెస్ నాయకులను అడ్డుకునేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులపై పోలీసులు లాఠీచార్జీ చేయడం ఎంతవరకు సమంజసం అని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు చేస్తున్న నిరంకుశ పాలనకు త్వరలో ప్రజలే చరమగీతం పాడే రోజు వస్తుందన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నిరుపేదల సంక్షేమమే ధ్యేయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


బూర్గులలో లబ్ధిదారులకు ఇళ్ల మంజూరుపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల, కాశిరెడ్డిగూడ, కడియాలకుంటతండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేస్తున్నారన్నారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకు కోసం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తున్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బన్సీలాల్, ఎంపీఓ జయంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి సరోజ, మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి భీంభరత్

షాబాద్: పేదల సొంతింటి కలను నెరవేరుస్తామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తాళ్లపల్లి, పోతుగల్, షాబాద్, కక్కులూర్, కేసారం, అంతారం గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి వారు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పామెన భార్గవ్‌రామ్, సహకార సంఘం వైస్ చైర్మన్ మద్దూరు మల్లేశ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీరాంరెడ్డి, నర్సింలుగౌడ్, మాజీ వైస్ ఎంపీపీ రమేశ్ పంతులు, మాజీ ఉపసర్పంచ్ బాలనర్సింలు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు పామెన నర్సింలు, చెన్నయ్య, సీనియర్ నాయకులు రవీందర్, పెంటారెడ్డి, బాల్‌రాజ్, యాదయ్య, రాంచందర్, మాజీ సర్పంచ్‌లు మహేందర్‌గౌడ్, బుచ్చయ్య, యాదగిరి, సంతోష్‌రెడ్డి, చంద్రయ్య ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి

కేశంపేట: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ సీనియర్ నాయకుడు, కేశంపేట మాజీ సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఇళ్ల నిర్మాణాలకు అధికారులతో కలిసి ఇందిరమ్మ కమిటీ సభ్యులు భూమిపూజ నిర్వహించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందించారు. అదేవిధంగా కోనాయపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కేశంపేట గ్రామ పంచాయతీ కార్యదర్శి విద్యావతి, నాయకులు అనసూయ, సత్తయ్య, జంగయ్య, సురేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు అందిస్తాం


లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, నాయకులు

మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్

చేవెళ్ల: అర్హులైన పేదలకు ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని మల్కాపూర్‌లో 15 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపత్రాలను సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పేదలను గుర్తించి ఇప్పటికే అర్హుల జాబితాను సిద్ధం చేశామన్నారు. లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆర్డీఓ చంద్రకళ


ఆర్డీఓకు ఫిర్యాదు అందిస్తున్న చనువెల్లి రైతులు

చేవెళ్ల: ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడూ పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆర్డీఓ చంద్రకళ అన్నారు. సోమవారం చేవెళ్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రెండు ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. ఇందులో శంకర్‌పల్లి మున్సిపాలిటీ కేంద్రంలో ఫత్తేపూర్ రోడ్డును బాగు చేయాలని సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేశ్‌కుమార్ ఫిర్యాదు చేయగా, మరొకటి చేవెళ్ల మండలంలోని చనువెల్లిలో పలువురు రైతులు ఖమ్మం నర్సరీలో తెచ్చిన నారుతో మోసపోయామని న్యాయం చేయాలని ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేశారు. ఈ రెండు ఫిర్యాదులలో ఒకటి శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌కు పంపించామని, మరొకటి చేవెళ్ల అగ్రికల్చర్ అధికారులకు పంపించి పరిష్కరించాలని సూచించినట్లు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు దాదాపు 46 ఫిర్యాదులు వచ్చాయని, వీటిలో 30కిపైగా పరిష్కరించామన్నారు. ఎక్కువగా భూముల సమస్యలకు సంబంధించి ధరణిలో ఉన్న ఇబ్బందులపై వచ్చిన వాటితో పాటు ఇతర ఫిర్యాదులు ఉన్నాయన్నారు.

భూభరతితో సత్వర పరిష్కారం

భూభారతిలో భాగంగా రైతుల భూ సమస్యలు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం అవుతాయని ఆర్డీఓ చంద్రకళ పేర్కొన్నారు. జూన్ 2 నుంచి పూర్తి స్థాయిలో భూభారతి అమలు అవుతుందని తెలిపారు. గత నవంబర్‌లో చేవెళ్ల డివిజన్ పరిధిలో దాదాపు 8వేలకు పైగా పెండింగ్ సమస్యలు ఉంటే అవీ ఇప్పుడు 800లకు వచ్చాయంటే ఏ స్థాయిలో పరిష్కారం అవుతున్నాయో అర్థం చేసుకోవచ్చన్నారు. భూముల సర్వేకు సైతం ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇస్తుందని, దీంతో మండలానికి నాలుగైదు మంది సర్వేయర్లు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. . భూమి సరిహద్దులతో పక్కాగా ఉండేందుకు సర్వేలతో సమస్యలు లేకుండా పోతాయని స్పష్టం చేశారు.

పరిసరాల శుభ్రతతో రోగాలు దూరం

ప్రిన్సిపాల్ కలందర్‌బాబు

మొయినాబాద్‌రూరల్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దూరమవుతాయని ప్రిన్సిపాల్ కలందర్‌బాబు అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం కళాశాల విద్యార్థులు జాతీయ సేవా పథకంలో భాగంగా అమ్డాపూర్, కాశింబౌలి గ్రామాల్లో వారంరోజుల పాటు నిర్వహించే ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ కలందర్‌బాబు, పశువైద్యాధికారి దేవిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ.. రైతులకు పంటల సాగుపై అవగాహన, పంటల మార్పిడి, సమగ్ర సస్యరక్షణ అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. బడీడు పిల్లలను చదువుకునే విధంగా చేయడం, స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తారని వెల్లడించారు. వారంరోజుల పాటు రోజుకు ఒక కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవితరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారి లావణ్య, ఎన్‌ఎస్‌ఎస్ ఇన్‌చార్జి రజిత, రామకృష్ణ, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు

శంకర్‌పల్లి: ఫర్టిలైజర్ దుకాణదారులు విత్తనాల విషయంలో జాగ్రత్తలు వహించాలని, ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని వ్యవసాయాధికారులు, పోలీసులు హెచ్చరించారు. సోమవారం శంకర్‌పల్లిలో ఫర్టిలైజర్ డీలర్లతో చేవెళ్ల ఏడీఏ సురేశ్‌బాబు, వ్యవసాయాధికారులు, పోలీసులు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డీలర్లు డబ్బులకు ఆశపడి నకిలీ విత్తనాలు అమ్మితే, రైతులు దిగుబడి రాక మోసపోతారని, ఇది పెద్ద నేరమని స్పష్టం చేశారు. అదేవిధంగా రైతులకు అమ్మిన విత్తనాలకు సంబంధించి పక్కాగా రికార్డులు మెయింటెన్ చేయాలని సూచించారు. వ్యవసాయాధికారులు, పోలీసులు ఏ క్షణంలోనైనా తనిఖీలు చేస్తారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో శంకర్‌పల్లి వ్యవసాయాధికారి సురేశ్‌బాబు, ఎస్‌ఐ దేవేందర్, డీలర్లు పాల్గొన్నారు.